
# ఎన్నిక

— దివిజ —




"ఇన్నాళ్ళకు నా అన్వేషణ ఫలించింది." తృప్తిగా నిట్టూర్పింది కోసల. ఇరవై ఏళ్ళ నిరీక్షణ, గాలింపు. ఎన్ని ప్రయత్నాలు, ఎన్నెన్ని పరీక్షలు. గెలుపు తన దవుతుందన్న నమ్మకం ఇగిరిపోయి, నిస్పృహ ఆవరించినా రాజీ పడలేదు. అదే తన బలహీనత.

అవును, ఓటమిని అంగీకరించలేకపోవడమే తన బలహీనత. అదే తన ఉనికికి, ఈనాటి విజయానికి, సంతోషానికి కారణమైంది. ఎటువంటి పరిస్థితులలోనూ దేనికీ రాజీ లేదు, రాదు. విజయగర్వం ఆమెను ఆవహించసాగింది.

ఆత్మవిశ్వాసం ఇనుమడించి అహంకారరేఖలు నిర్లక్ష్య మందహాసమై కోసల పెదవులపైన ఓ క్షణం మెరిసింది. ఏవో జ్ఞాపకాలు ఆమె కళ్ళలో కదలాడాయి తెరలు తెరలుగా.

ఇరవై ఏళ్ళ క్రితం... ప్రాయం, పరువం కలిసి కోసలను వివాహమనే కోటలోనికి తరుముతోంటే, పాదాలకు ఇనుప సంకెళ్ళు బిగించుకుని, అడుగు తీయకుండా గట్టిగా బంధించుకుంది రాతి గుండెతో, అచంచల నిశ్చయంతో, అంకురిత విశ్వాసంతో. ఆ విశ్వాసమే, ఆ నిశ్చయమే, ఆ రాతిగుండే ఎంతమందిని నిరాశపరిచిందో, మరెంతమందిని నిరాకరించిందో. స్త్రీ వ్యక్తిత్వానికీ, స్వాతంత్ర్యానికీ సమాధి కట్టి పెళ్ళిని ఓ పాత ళకూపంలా గుర్తించే కోసలకు ఆ ఆలోచనే భయాన్ని పుట్టించేది. పెళ్ళి, పెళ్ళంటూ కలవరిస్తూ, పెళ్ళి జరిగితే చాలు బ్రతుకు ధన్యమైనట్టు పరవశించే తోటివాళ్ళను చూస్తే అంతులేని ఆశ్చర్యం, నాడే కాదు నేడు కూడా. పెళ్ళికోసం అందరూ ఎన్నెన్నో పాట్లు పడుతూంటే, తను మాత్రం దాన్ని కప్పించుకోడానికే అన్ని పాట్లూ పడాల్సివచ్చింది ఇంటా, బయటా కూడా. ఎన్నిసార్లు ఆ యజ్ఞంలో బలిపశువైపోతుంటే తనను తను రక్షించుకుంది ! లెక్కపెట్టబోతే విఫల ప్రయత్నమేనేమో !

పల్లెటూరి వాతవరణం పూర్తిగా సమసిపోని ఊళ్ళో, అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టి, పెరిగిన కోసలకు మానసికంగానూ, బుద్ధిలోనూ, ఆలోచనలలోనూ తల్లిదండ్రులతో పొత్తు కుదరలేదు. సంప్రదాయాలను, కట్టుబాట్లను అడుగడుగునా విమర్శిస్తూ, విసుక్కునే కోసల విపరీతంగా కనిపించింది. చదువుపై వ్యామోహం

పెంచుకుని, తన "స్వంత" జీవితం కోసం అంగలార్చే కోసల వింతగా అనిపించింది. మగవాడు సంపాదించడం, ఆడది ఇంటి పనులు చేయడమే జీవితం అని నమ్మిన ఆమె తల్లిదండ్రులకు కోసల పెళ్ళి గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం కనిపించలేదు. బంధువర్గంలోనే ఉన్న చాలామంది యువకులు కోసల అందం అందుకోవడానికి మునివేళ్ళపై నిలబడటమే అందుకు కారణం. మగవాడైతే చాలు, పెళ్ళికి ఏ అభ్యంతరమూ చూడలేని ఆ మానవుల మధ్య కోసల ఆలోచనలు మాటల రూపాన్ని పొందలేకపోయాయి. మనిషికి ఉండాల్సిన ఆలోచన, ఆత్మీయత, ఆరాధనా, ఆలంబన అనే భావనలు మృగ్యమై స్త్రీ పట్ల కేవలం మృగాలుగా మసిలే ఆ యువకుల వైఖరి కోసల గుండెను దడదడలాడించేది. అందుకే పెళ్ళికంటే చావు నయం అని మొండికెత్తిన పదిహేనేళ్ళ కోసల, చదువు మిషతో దూరంగా సాగిపోవడం ఓ పాడుపుకథగా మిగిలిపోయింది బంధుమిత్ర సపరివారంలో.

అక్కడితో ఆగిపోలేదు కోసల పోరాటం. స్త్రీని ఒకరి ఆస్తిగా, భోగవస్తువుగా పరిగణించే సమాజంలో కోసలకు తన ఆశలు, ఆలోచనలకు రూపం కల్పించుకోవడం అంత సులభంగా కనిపించలేదు. ఆదర్శాలలో నమ్మకం పెంచుకుని, ఉదాత్తమైన ఆశయాలతో కాలేజీలో అడుగు పెట్టిన కోసల తన రూప, లావణ్యాల కారణంగా అందరి దృష్టి నాకట్టుకుంది. మగవా డనిపించుకున్న ప్రతివాడూ తన నాకర్షించడానికి పడే తపన, కేవలం అందం కోసం తనను పెళ్ళి చేసుకోవాలనే ఆరాటం ఆమెకు యాతన కలిగించాయి. భావనలు, ఆలోచనలు, ఆశయాల గురించి పట్టించుకోని మగవారిపైన ఏహ్యాభావం పెరగసాగింది. ఫలితంగా, క్రమేణా అలంకరణలు విసర్జించి, మాటా పలుకూ తగ్గించి, తన చుట్టూ గిరి గీసుకుని ఓ పరిధిలో యోగినిలా ఉండటం అలవాటు చేసుకుంది. అయినా, ఆమె మనసు తన కనురక్తుడైన సహచరికోసం సదా అన్వేషణలో ఉండేది.

కోసల గంభీర వ్యక్తిత్వాన్ని తెలుసుకున్న కొందరు ఆమెను తెలివితేటలతో ఆకర్షించే ప్రయత్నాలు చేసి, స్నేహం పెంచాలని చూశారు. కాని, ఆత్మీయత లోపించిన వారి కృత్రిమ ప్రవర్తన ఆమెను కదిలించలేకపోయాయి. కోసల ఒక 'కొరకరాని కొయ్య' అనిపించుకుంది.

కాలేజీ వదిలి యూనివర్సిటీలో రెండేళ్ళు ఎమ్.ఎ. ముగించేటప్పటికి కోసల తన పరిధిలోంచి కొద్దిగా బయటికి రాసాగింది. పురుషుల పట్ల ఆమె కాఠిన్యం, గాంభీర్యం క్రమంగా తగ్గుముఖం పట్టి అనేకులతో స్నేహం కలిసింది. కాలేజీ నాటి ఆకతాయితనం పోయి ఆలోచన పెరిగి, ఆడా, మగా కలిసి తిరిగే యూనివర్సిటీ వాతవరణం కూడా అందుకు కారణం.

ఆ రోజుల్లోనే చెప్పుకోదగ్గ మగ స్నేహితులు ఏర్పడ్డారు కోసలకు.

ఊహ తెలిసిన నాటినుంచి తన ఆలోచనాపటిమతో ప్రత్యేకమైన అభిప్రాయాలు ఏర్పరచుకుని, స్వంత వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకున్న కోసల ప్రవర్తన ఎప్పుడూ ఓ స్థాయిలో ఉండేది. చూసే కళ్ళలో, నడిచే నడకలో, నవ్వే నవ్వులో, ఆడే మాటలో ఆమె వ్యక్తిగా ప్రస్ఫుటించేది. ఆ వ్యక్తిత్వమే ముగ్గురిని బలంగా ఆకర్షించింది.

తెలివితేటలను, నిజాయితీని ఇష్టపడే ముకుంద కోసల చదువులో చూపే ఆసక్తినీ, జ్ఞానార్జనకు చేసే కృషినీ మెచ్చుకుంటే, సామాజిక స్పృహతో, క్రమబద్ధంగా, ధైర్యంగా జీవితాన్ని చేతిలోకి తీసుకున్న కోసల సాహసాన్ని అపూర్వంగా స్వీకరించాడు విధి, అదృష్టం మీద నమ్మకంలేని నిర్మల్. రూప, లావణ్యాలతో అందరినీ ఆకట్టుకుంటూనే గంభీరంగా, పరిధిలో ఉంటూనే కలివిడిగా హాస్యం చేస్తూ - స్నేహానికి ప్రతీకగా, ఆత్మీయంగా భాసించే కోసలంటే చెప్పలేని ఆరాధన విజయ్‌కి.

తనను గౌరవిస్తూ, తన అభిప్రాయాలకు విలువనిస్తూ, సకారణంగానే విమర్శిస్తూ, స్నేహాన్ని పంచే ఈ ముగ్గురినీ ఆత్మీయులుగా భావించింది కోసల. ఎంతటి ఏకాంతంలో అయినా ప్రలోభానికి లొంగక, సంవత్సరాల కొద్దీ కలిసి తిరిగినా ఏమాత్రం అసభ్య ప్రవర్తనకు తావివ్వక, అవసరమైనప్పుడు తోడుగా ఆదుకునే ఈ స్నేహితులు స్నేహితులుగానే మిగిలారు కాని ఇతర భావాలకు అవకాశ మివ్వలేదు. వారి సాన్నిధ్యం ఆమెకు ఉత్సాహంగా ఉండేది. వారి ఆత్మీయత మనోల్లాసాన్ని కలిగించేది. వారి విశాల మనోభావాలూ, తెలివితేటలూ తృప్తిని అందించేవి.

కోసల ఆత్మీయ స్నేహం పొందిన ఈ ముగ్గురూ అంతరంగికంగా అనేకులకు మత్సరాన్ని రేపారు. ఆమె గురించి ఆలోచించే ప్రతి యువకుడూ తాను పొందలేని ఆ అవకాశం ఈ ముగ్గురిలో ఎవరిని వరిస్తుందో అని ఆత్రతగా ఎదురుచూడసాగారు.

అన్నీ తెలిసిన కోసల ఏ భావాలూ వ్యక్తం చేయలేదు. కారణం, తనకు ఏ భావాలూ లేకపోవడమే. వరసగా అయిదు సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నా ముకుంద, నిర్మల్, విజయ్‌ల పైన తనకు ప్రత్యేకమైన ఆసక్తి జీవితాన్ని పంచుకోవాలన్న కోరిక ఎందువల్ల కలగడంలేదు అన్న ప్రశ్నకు కోసల మనసు సరిగ్గా జవాబివ్వలేకపోయింది. అభిప్రాయాలు కలిశాయి. ఆత్మీయత, గౌరవం పెరగాయి. స్నేహం, ఆ స్నేహం కోసం త్యాగం అన్నీ ఉన్నాయి. కాని... కాని... ఇంకేదో లోపించింది. జీవితాన్ని పంచుకోవడానికి, మనసు, తనువు పంచుకోవడానికి మరేదో కావాలి. 'కావాలి' అనే భావం వారిపట్ల పుట్టలేదు. ఆ స్నేహంలో సంతోషమే కాని, తన్మయత లేదు. ఆ ఆత్మీయతలో ఆర్తి లేదు, తపన లేదు. ఆ ప్రేమలో, ఆ అభిమానంలో పారవశ్యం లేదు. ఆ కలయికలో స్పందన లేదు. 'ఇతనే నా మనిషి' అనే తృప్తి లేదు.

అందరిలాగే ఆ ముగ్గురూ తనపై మనసు నిలుపుకుని, ఆశలు పెంచుకున్నారని తెలుసు. ముగ్గురితోనూ స్నేహం ఒకలాగే ఉండటంవల్ల వాళ్ళు నమ్మకం పెంచుకోలేదని కూడా తెలుసు. కాబట్టి, ఇది వారిని నిరాశ పరచడం అనిపించుకోదు. ఎటువంటి పరిస్థితుల్లోనూ తమ మధ్య అటువంటి భావనలు బయటపడలేదు. కనుక, ఇది స్నేహంగానే మిగిలిపోతుంది అనుకుంది కోసల.

ఇంగ్లీషు లిటరేచర్‌లో డాక్టరేట్ థీసిస్ ముగించి, ఓ చిన్న ఊళ్ళో మహిళా కళాశాలలో దొరికిన లెక్చరర్ ఉద్యోగంలో చేరింది కోసల - స్నేహ బృందాన్ని ఆశ్చర్యసాగరంలో ముంచేసి.


పాతికేళ్ళు దాటిపోయాయి, ఇప్పటికైనా పెళ్ళి చేసుకొమ్మని తల్లి పోరు ఆరంభమైంది కోసలకు. ఏమని చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీలేదు కోసలకు.

"బాగా చదువుకున్నవాళ్ళు, నీవు ఉద్యోగం చేయడానికి ఏ అభ్యంతరమూ లేనివాళ్ళు, నీలాగే ఆధునిక జీవితం కోరుకునేవాళ్ళే చాలామంది ఉన్నారు. ఎవరో ఒకరిని చూసి చేసుకొమ్మని" బలవంతపెట్టసాగింది తల్లి.

"ముక్కూ, మొహం తెలియని వ్యక్తులను ఏం చూసి పెళ్ళి చేసుకోను? మనసు చదివిన స్నేహితులే నా గుండెల్ని కదిలించలేదు" గొణుక్కుంది కోసల.

"అసలు నీవు బ్రతికేది దేనికోసం?" అనే తల్లికి కోసల మౌనమే సమాధానమయ్యింది.

ఏ మార్పులూ లేకుండా కాలచక్రం తిరిగి



పదేళ్ళు చరిత్రలో కలిసిపోయాయి. తన జ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు, తన అభిప్రాయాలకు రూపాన్నిచ్చి పత్రికలకూ, జర్నల్స్‌కూ రాయడం మొదలుపెట్టింది కోసల. విసుగూ, విరామం లేని దినచర్యలోనూ, తృప్తికరమైన జీవితంలోనూ కూడా కోసల గుండెల్లో తెలితి, గుబులు తొంగిచూసేవి అప్పుడప్పుడూ.

అందరి దృష్టిలోనూ త నో మహత్తర సాధకురాలు. కాని, వ్యక్తిగత జీవితంలో తాను ఓడిపోయినట్టేనా? విభిన్నధోరణి వల్ల అయినవా రందరికీ దూరమైంది. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు తమ తమ జీవితాలలో మునిగిపోయి తన నో వెర్రిదాన్నిలా చూస్తున్నారు. తల్లిదండ్రుల కాలం తీరిపోయింది. ఒక రిద్దరు స్నేహితులున్నా అది యాంత్రికమే.

అసలు తను ఎవరినీ వరించకపోవడం తన బలహీనతా లేక ఓటమా? తనలాంటివారు ఇంకెవరూ ఈ సంఘంలో లేరా? తను మాత్రమే



ఇలా వింతగా, విపరీతంగా మిగిలిపోయిందా?

సంఘర్షణ... అంతస్సంఘర్షణలో పడి తను దైహికంగా, మానసికంగా కూడా డీలా పడినట్టు తెలియసాగింది కోసలకు. దీంట్లో నుంచి బయటపడటానికి ఏం చేయాలి? మార్పు... అవును, మార్పు కావాలి. పరిసరాలు మారితే జీవితం కూడా మారే అవకాశాలు దొరకవచ్చు. తథాస్తు అన్నట్టు మద్రాసు యూనివర్సిటీలో రీడర్‌గా సెలెక్ట్ అయినట్టుగా ఆర్డర్స్ వచ్చాయి. వెంటనే కొత్త మజిలీకి బయలుదేరింది.

ఈ ముప్ఫయైదవ ఏట ఇక గుండె తలుపు తట్టే మనిషి దొరకగలడన్న ఆశ ఇగిరిపోతుంటే, కోసల స్వభావానికి విరుద్ధంగా తనను ఆవహిస్తున్న నిరాశా, నిస్పృహలనూ, నిరుత్సాహాన్ని లోపలే అణగదొక్కి కొత్త పరిసరాల్లో కొత్త చైతన్యాన్ని పుంజుకుంది.

అదృష్టం ఎప్పుడో ఒకసారి మాత్రమే తలుపు తడుతుందనీ, అది అందుకోవడమే అవకాశం అనీ అంటారు కొందరు. కాని, మానవ ప్రయత్నంలో మాత్రమే నమ్మకం కలిగిన కోసల భవిష్యత్తు గురించి కొంచెం లోతుగా ఆలోచించసాగింది.

ఆ సమయంలోనే వచ్చాడు కృపానంద్ యూనివర్సిటీకి - కొత్త అపాయింట్‌మెంట్.

సంవత్సరారంభంలో సమావేశమైన యూనివర్సిటీ టీచర్ల సంఘం కొత్త బాధ్యతను చేపట్టింది - విద్యార్థులలో కరిగిపోతున్న నైతిక విలువలను పునరుద్ధరించడం. సోషియాలజీలో డాక్టరేట్ పొంది, పత్రికలకూ, జర్నల్స్‌కుఅసంఖ్యాకంగా ఆర్టికల్స్ రాసి, అనేక సాంఘిక సమస్యలపైన విభిన్న కోణాలలో రీసెర్చి జరిపి, ఫలితాలను, వాటి నివేదికలను ప్రచారంలోనికి తీసుకొచ్చి, సాంఘిక తత్వవేత్తగా ఇప్పుడిప్పుడే వెలుగులోనికి వస్తున్న కృపానంద్ కొత్తగా వచ్చినా, అందరి బలవంతంతో బాధ్యతను అంగీకరించకతప్పలేదు.

కృపానంద్ రాసిన అనేక వ్యాసాలు చదివి, తన ప్రతిక్రియలు, అభిప్రాయాలు ఉత్తరాల ద్వారా పత్రికలలో వ్యక్తం చేసిన కోసల అతన్ని కలుసుకోవడంలో, స్నేహం చేయడంలో అత్యంత ఆసక్తి కనబరచింది. అతని గంభీరమైన విగ్రహం, మొహంపైన చెరగని చిరునవ్వు, అతి తక్కువగా మాట్లాడినా ఆత్మీయత కనపరిచే చూపులూ కోసలను సూదంటురాయిలా అతని వైపుకు లాక్కున్నాయి. ఆమె అందాల్నీ అభిప్రాయాల్నీ మెచ్చుకోలుగా చూసే ఆ కళ్ళు తనలో ఏదో వెతుక్కుంటున్నట్టుగా అనిపించేది కోసలకు. లైబ్రరీలో ఎప్పుడూ కనిపించే అతన్ని వీలు దొరికినప్పుడల్లా కలిసేది.

క్రమంగా పరిచయం స్నేహంగా మారి సాయంత్రాలు కూడా గడిపేవారు. వృత్తి, సంఘం, దేశం గురించిన విషయాలు వారి సంభాషణలను ఆక్రమించుకుని గంటలు, రోజులు, నెలలు గడిచిపోయి వారు స్నేహితులుగా, ఆత్మీయులుగా గుర్తింపు పొందారు. అప్పుడప్పుడు కలిసి భోంచేయడం, సెలవు రోజుల్లో మ్యూజియం, ఇతర స్థలాలు చూడటం పరిపాటయ్యింది.

కోసల కళ్ళలో వెలుగు, ముఖంలో కాంతి, నడకలో చురుకుదనం, మనిషిలో నవచైతన్యం తనకు తెలియకుండానే ఆవరించుకున్నాయి.

అనుకోకుండా తారసపడ్డ పాత స్నేహితురాలు - "ఏమిటీ, ఇక్కడి కొచ్చిన తరువాత చాలా మారినట్టుగా కనిపిస్తున్నావు. చాలా సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నట్టుంది జీవితం?" అంటూ పరామర్శించినప్పుడే ఒక్కసారిగా ఇహలోకంలోనికి వచ్చి పడింది కోసల. సుమారు ఆరు నెలల నుంచి చదవడం, రాయడం తగ్గిపోయింది. క్లాసులో పాఠాలు చెప్పడం, మిగతా సమయం, సాయంత్రాలు, సెలవు రోజులు కృపానంద్‌తో కలిసి పంచుకోవడం. నెమరువేసుకుంటే ఏదో తీయని భావన గుండెల్లో నిండిపోయింది. రెండు రోజులు ఆరోగ్యం బాగాలేక రాకపోతే అతని నివాసం ఎక్కడో తెలీక, వెళ్ళలేక, ఎప్పుడెప్పుడు చూద్దామా అని తను తపించడం గుర్తుకు వచ్చి ఉలిక్కిపడింది.

ఇదీ... ఇదీ... నిజమా? అంటే... అంటే... తన నిరీక్షణ ముగిసింది. అన్వేషణ ఫలించింది.

"నేను గెలిచాను. నేను గెలిచాను. నేను గెలిచాను" అని గొంతెత్తి అష్టదిక్కులు పిక్కటిల్లేలా అరవా లనిపించింది.

జ్ఞాపకపు తెరలు కరిగిపోయి కోసలలో చలనం కలిగింది. ఆమెలోని అణువణువు ఆనందంతో, తృప్తితో పులకరిస్తోంది.

ఇక ఏమాత్రం ఆలస్యం చేయలేదు కోసల. తన మనసు పూర్తిగా అతనికి తెలియజేయాలి. ఇంతకాలం తను ఎందుకు ఆగిందో, దేన్ని వెతుక్కుందో అతనికి స్పష్టపరచాలి. ఈ ప్రస్తావనకు అతని అంగీకారం ఉంటుందనేది తన ప్రగాఢ నమ్మకం.

చెప్పవలసిన విషయాలు చాలా ఉండటంవల్ల ఉత్తరం ద్వారా తెలియపరచడమే మంచిదని, వివాహం, తన అభిప్రాయాలు, నిరీక్షణ, చివరికి ఈనాటి నిర్ణయం - అన్నీ క్లుప్తంగా రాసింది. నిస్సంకోచంగా అతనికి అందజేసింది. "వీలైనంత త్వరలో సమాధానం కావాలి" అని కవరు చేతిలో పెట్టింది, విషయం చెప్పకుండానే. ఏ భావాలూ వ్యక్తం చేయకుండా, మౌనంగా, చిరునవ్వుతో అందుకుని తలపంకించాడు కృపానంద్.

మరునటి రోజే అనుకోకుండా కాలేజీకి సెలవు పెట్టాల్సి వచ్చింది వారం రోజుల పాటు అనారోగ్యంవల్ల కోసల. అస్వస్థతలో కూడా రేయింబవళ్ళూ కృపాను గురించిన ఆలోచనలు ఆమెను వదల్లేదు. సరిగ్గా ఏడో రోజు ఒంట్లో ఓపిక లేకపోయినా కృపాను చూడాలని, అతని అంగీకారం అందుకోవాలని, అతను తనకోసం ఎదురుచూస్తూ ఉండవచ్చని వెళ్ళింది డిపార్ట్‌మెంట్‌కి. కాని, క్లాసుల హడావిడిలో కృపాని కలుసుకోవడం పడలేదు. సాయంత్ర మవుతుండగా పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది ఆమెకు. యథాలాపంగా కవరు చింపి చదవసాగింది.

క్రమంగా కోసల అణువణువులో మార్పు కనిపించసాగింది. శరీరం నిటారై, చూపులు స్థిరమై, మనస్సు నిశ్చలమై, ఆమె హృదయ కుహరంలో ఆ ఉత్తరంలోని మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి.

"ప్రియ కోసలా,

స్వయంకృషితో, స్వతంత్ర భావాలతో జీవితాన్ని మలచుకుని, సాధనతో, సాహసంతో జీవిస్తున్న నీకు ముందుగా నా జోహార్లు.

నీ మనసు చదవలేని పిచ్చివాణ్ణి కాదు. నీ ఈ ఆహ్వానం ఎదురుచూసినదే. నిజంగా నేనే ఆహ్వానించాల్సింది.

జీవితం ఎప్పుడూ మన చేతిలోనే ఉందని నమ్మే నీవు ఈ విషయాన్ని ఏ విధంగా స్వీకరిస్తావో, విశ్లేషిస్తావో తెలియదు.

సృష్టిలో సర్వమూ అనుభవయోగ్యం కాదు. పూసిన ప్రతి పూవూ కాయ కాదు. ప్రతి కాయా పండై విత్తు నివ్వదు. ప్రకృతిని పండించదు. సస్యశ్యామలం చేయదు.

అలాగే, మానవుని ప్రథమ కర్తవ్యంగా పరిగణించబడిన సంతానోత్పత్తి కార్యం నుంచి నేను బహిష్కృతుణ్ణి. మనసు నింపి, కడుపు పండించి, ఒడి నింపలేని నేను ఎప్పటికీ స్నేహితుడిని మాత్రమే. చిక్కుముడిలాంటి వీడని బంధాలతో నిరంతర పోరాటం జరిగే ఈ మానవ ప్రపంచంలో నేను కేవలం ఓ అతిథిని, ప్రేక్షకుడిని.

సెలవు

కృపానంద్,"